లైన్..క్లియర్

- జనతా బజార్ వద్ద తొలగిన స్క్రాప్ వాహనాల అడ్డంకి
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు, వాహన చోదకులు
- ట్రాఫిక్ పోలీసులకు ప్రజల ధన్యవాదాలు


స్క్రాప్ వాహనాలు తొలగించక ముందు..


జనతాబజార్ వద్ద స్క్రాప్ వాహనాలు తొలగించడంతో సాఫీగా సాగిపోతున్న వాహనాలు

జగదాంబ: జనతా బజార్ వద్ద అనధికార స్క్రాప్ వాహనాలను తొలగించడంతో స్థానికులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 35వ వార్డు ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం వద్ద జీవీఎంసీ జనతా బజార్ ఉంది. 152 దుకాణాలతో ఉండే ఈ బజార్‌కు ఎదురుగా ఉన్న 75 ఫీట్‌రోడ్డులో స్క్రాప్ వ్యాపారాలు ఇష్టానుసారంగా తమ వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. అంతే కాకుండా అడ్డదిడ్డంగా వాహనాలను పార్క్ చేయడంతో వీధులు, కాలువలను శుభ్రం చేయడానికి వచ్చే పారిశుధ్య కార్మికుల పనికి ఆటంకంగా ఉండేది. అదే విధంగా రహదారిపై వాహనాల పార్కింగ్ వలన ప్రమాదాలు చోటు కూడా జరుగుతుండేవి. పోర్టు సమీపంలో ఉన్న ఈ రహదారిపై రోజు ఉదయం, సాయంత్రం, నైట్‌డ్యూటీ చేసుకుని వచ్చే పోర్టు ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యేవారు. దీనిపై స్థానికులు, వాహన చోదకులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం ఉండేది కాదు. ఈ నేపథ్యంలో ఇటీవల జీవీఎంసీ కమిషనర్ పర్యటన సందర్భంగా రహదారిపై స్క్రాప్ వాహనాలను వ్యాపారులు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడం గమనించారు. దాంతో ఆయన ఆ వాహనాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేయడంతో కింది స్థాయి అధికారులు, వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు వాటిని తొలగించారు. దీంతో స్థానికులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలకు వీలుగా ఉంది



నిజానికి ఇది 75 ఫీట్ రోడ్డు. అంటే పాదచారులు, వాహనాల రాకపోకలకు చక్కగా సరిపోతుంది. కానీ రహదారి ఆక్రమణ వల్ల రోడ్డు ఇరుగ్గా ఉండేది. అధికారుల ఆదేశాలతో స్క్రాప్ వాహనాల బాధ తొలగిపోయి రోడ్డు విశాలంగా మారి రాకపోకలకు అనుకూలంగా ఉంది.

–సతీష్‌కుమార్, పోర్టు ఉద్యోగి, పాతనగరం.

ప్రమాదాలు తగ్గుతాయి..



జనతాబజార్ ఎదురుగా నిత్యం ప్రమాదాలు జరుగుతుండేవి. స్క్రాప్ వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడం వల్లే ఈ సమస్య ఉత్పన్నం అయ్యేది. ఇప్పుడు రహదారిని క్లియర్ చేయడంతో ప్రమాదాలు తగ్గుతాయి. ప్రయాణికులు సురక్షితంగా ఉంటారు.

–కిరణ్, పూర్ణామార్కెట్.

రోడ్డు బ్లాక్ చేస్తే చర్యలు తీసుకుంటాం..



రహదారిపై అక్రమంగా పార్కింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే చాలాసార్లు హెచ్చరించాం. పెట్టీ కేసులు పెడతాం. వాహన చోదకుల సురక్షిత ప్రయాణమే ట్రాఫిక్ విభాగం లక్ష్యం.

–భాస్కరరావు, వన్‌టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ.

క్లుప్తంగా

యువతికి రక్షణ


యువతిని జ్యోతిర్మయికి అప్పగిస్తున్న జీఆర్‌పీ పోలీసులు

అల్లిపురం: రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన ఒక యువతికి ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. గాజువాక ప్రాంతానికి చెందిన కె.కీర్తన తల్లిదండ్రులు రోడ్డు ప్రమాదంలో ఏడాది క్రితం మృతి చెందారు. సైకిల్ మీద వెళ్తున్న వారిని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే చనిపోయారు. అప్పటి నుంచి ఆమె అనాథలా రోడ్డుమీదే ఉంటుంది. ఐదు రోజుల క్రితం ఆమె రైల్వేస్టేషన్‌లో ఉండగా జీఆర్‌పీ పోలీసులు ఆమెను గమనించి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందించడంతో ఆమెను షెల్టర్‌కు తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. ఆమె డిగ్రీ చదువుకోవటంతో ఆమెకు ఉపాధి కల్పిస్తామని ఏయూటీడీ టీఎస్ఆర్ కాంప్లెక్స్ మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

పాత చలానాలు రద్దు చేయాలి


నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులు

సీతమ్మధార : తమపై ఉన్న పాత చలానాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ విశాఖ జిల్లాలో ఆటో డ్రైవర్లపై ఉన్న ఈ చలానాలు రద్దు చేయాలని, పెంచిన డీజిల్, పెట్రోలు, వంట గ్యాస్ ధరలు తగ్గించి జీవనోపాధి కల్పించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత రవాణా రంగంపై లక్షల కోట్ల రూపాయల ఆర్థిక భారం మోపిందన్నారు. ఈ కార్యక్రమంలో రావికృష్ణ, చంటి, వెంకట్, శివ, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేణుక యల్లమ్మ ఆలయంలో అన్నదానం


వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న ఆలయ కార్యవర్గ సభ్యులు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. పంపాన లక్ష్మీ హర్షిత, ఆమె తండ్రి పంపాన గణేష్ సహకారంతో ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలరావు, 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపికృష్ణ, కోశాధికారి వాసుపల్లి నారాయణ తదితరులు వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో కొలువైన షిర్డీసాయి ధ్యాన మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రామాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు జూలై 3న నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణ రెడ్డి, సనపల వరప్రసాద్ ఆవిష్కరించారు. ఇందుకు సంబంధించి సాయ నామజపంతో ఏకాహం పూర్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకుడు అయలూరి రామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మండిన సూరీడు

- ఎండ తీవ్రతకు నగరవాసులు విలవిల


నిర్మానుష్యంగా అచ్చియ్యమ్మపేట జంక్షన్


జనసంచారం లేని గోకుల్ థియేటర్ ప్రాంతం

అల్లిపురం: రోహిణి కార్తి ముగిసింది. మృగశిర ప్రవేశించింది. దీంతో వాతావరణం చల్లబడుతుందనుకున్న నగరవాసులకు గురువారం సూరీడు తన ప్రతాపం చూపించాడు. చండ ప్రచండుడై సుర్రుమనిపించాడు. ఉదయం చల్లగానే ఉందని భావించిన నగరవాసులకు వాతావరణం అంతకంతకు వేడెక్కడంతో జనం విలవిల్లాడారు. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏకధాటిగా సూరీడు వీరవిహారం చేశాడు. దీంతో నగరవాసులు నీడ కోసం వెంపర్లాడారు. శీతల పానీయాల కోసం వెతుకులాట మొదలెట్టారు. అందరూ నెత్తిన గుడ్డ వేసుకున్నారు. సుమారు 48 డిగ్రీల వేడిని నగరవాసులు చవిచూసారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలి


అధికారులతో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

మహారాణిపేట : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. కమిషన్ ఆదేశాలతో వారం రోజులుగా వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ నిర్వహిస్తున్న చైల్డ్ లేబర్ డ్రైవ్‌ను గురువారం కలెక్టరేట్ ఆవరణలో సీతారాం పరిశీలించారు. ప్రత్యేక బస్‌లో వివిధ ప్రాంతాలకు వెళ్లనున్న వివిధ శాఖల అధికారులను ఇప్పటి వరకు నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ బాలల బంగారు భవితకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో వేల కోట్లు ఖర్చు చేసి చక్కని విద్యా, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాయని అన్నారు. ఇటువంటి తరుణంలో బాలలను కార్మికులుగా మార్చి వారి జీవితాలను అగమ్యగోచరం కానీయొద్దని అన్నారు. అధికారులు పీటీవీ లోవకుమార్, సీహెచ్ శ్రీనివాస్, ఎస్.శిరీష, ఎ.ఆనంద్, లక్ష్మి, ప్రమీల, 1098 చైల్డ్‌లైన్ ప్రతినిధి మీనాకుమారి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పి.భాస్కరరావు, జ్యోతి, శ్రీదేవి, కె.ఎల్లయ్య, పి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత క్రైస్తవ వివాహ పరిచయ వేదిక

డాబాగార్డెన్స్: క్రైస్తవ సమాజంలో యువతీ యువకులకు వివాహ సంబంధాల విషయమై ఈ నెల 10న ఇండియా క్రిస్టియన్ మేట్రిమోని ఆధ్వర్యంలో ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్టు ఆ సంస్థ సీఈవో అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వారకానగర్ పౌరగ్రంథాలయం వేదికగా నిర్వహించనున్న ఉచిత క్రైస్తవ వివాహ పరిచయ వేదికలో పాల్గొనవచ్చన్నారు. అలాగే క్రైస్తవ వధూవరులు, వారి తల్లిదండ్రులు వెబ్‌సైట్‌లో ఉచితంగా ఫోన్ నంబర్లు చూసుకునే అవకాశం కల్పించనున్నట్టు చెప్పారు. వేదికలో పాల్గొనే వారు రెండు ఫొటోలు, బయోడేటాని 7013760253 వాట్సప్ నంబరుకు పంపాలని కోరారు. ఇప్పటి వరకు 16 వేల మంది వధూవరుల ఫొటోలు అందుబాటులో ఉంచామన్నారు. మరిన్ని వివరాలకు 8328239499 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

కిడ్నీ వ్యాధులపై పరిశోధనలకు హెచ్‌ఎంఎస్ సహకారం

- ప్రముఖ నెఫ్రాలజిస్ట్, విశ్రాంత వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ రవిరాజ్


అమెరికాలో హెచ్‌ఎంఎస్ వైద్యులతో డాక్టర్ రవిరాజ్

మహారాణిపేట : శ్రీకాకుళం జిల్లా ఉద్దానం కిడ్నీ వ్యాధులపై చేస్తున్న పరిశోధనలకు అమెరికాలోని హార్వర్డ్ మెడికల్ స్కూలు (హెచ్‌ఎంఎస్) సాంకేతిక సహకారం అందించేందుకు ముందుకు వచ్చిందని ప్రముఖ నెఫ్రాలజిస్టు, వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ విశ్రాంత ఉప కులపతి, విశ్రాంత డీఎంఈ డాక్టర్ టి.రవిరాజ్ తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న డాక్టర్ రవిరాజ్ హార్వర్డ్ మెడికల్ స్కూలును సందర్శించారు. అక్కడి నెఫ్రాలజీ విభాగం ఆహ్వానం మేరకు అమెరికా వెళ్లిన ఆయన ఉద్దానం కిడ్నీ వ్యాధులపై పరిశోధనకు సహకారం అందించాలని డాక్టర్ రవిరాజ్ కోరారు. దీనికి హెచ్‌ఎంఎస్ నెఫ్రాలజీ విభాగం నుంచి సానుకూల సంకేతాలు అందాయి. ప్రభుత్వం అనుమతి ఇస్తే పలాసలో కొత్తగా నిర్మిస్తున్న కిడ్నీ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో వారి సహకారం ఉపయోగించుకోవచ్చని డాక్టర్ రవిరాజ్ తెలిపారు. 1995 నుంచి 2000 మధ్యలో ఉద్దానం నుంచి కేజీహెచ్‌కు ఎక్కువ కిడ్నీ బాధితులు వచ్చే వారని ఆయన తెలిపారు. దీంతో ఉద్దానం వెళ్లి వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. తమ పరిశోధనలో అక్కడి ప్రజల్లో 18.5 శాతం మంది కిడ్నీ బాధితులు ఉన్నారని గుర్తించామన్నారు. సాధారణంగా షుగర్, బీపీ వంటి వ్యాధుల వల్ల కిడ్నీ సమస్యలు వస్తాయని, కాని ఉద్దానంలో అలాంటి సమస్యల వల్ల రాలేదన్నారు. నీరు, ఆహారం, మెటల్స్, భూమిని పరీక్షించామని, ఆయా పరీక్షల్లో కిడ్నీ జబ్బులు రావడానికి గల కారణాలు తెలియలేదన్నారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎంఎస్ సహకారంతో చేసే పరీక్షలతో పాటు జన్యు పరిశోధనలు కీలకం కానున్నాయన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ బులెటిన్‌లో ఉద్దానం కిడ్నీ వ్యాధులపై తాము చేసిన పరిశోధన పత్రం ప్రచురింపబడిందన్నారు.

అమ్మవార్ల ఉత్సవాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: అమ్మవార్ల పండగకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆర్థిక సాయం అందజేశారు. మత్రిపాలెం పరిసర ప్రాంతాల గ్రామ దేవత కుంచుమాంబ, దుర్గాలమ్మ పండగ మహోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజుల పాటు కిలోమీటర మేర విద్యుత్ లైటింగ్ ఏర్పాటుకు ఎమ్మెల్యే రూ.లక్షా 20 వేలు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు చిన్నారావురెడ్డి, అధ్యక్షుడు లక్ష్మణరావు, సెక్రటరీ మోహన్‌రావు, కోశాధికారి వైటీ సుబ్రహ్మణ్యంకు గురువారం ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లో గల ఎమ్మెల్యే కార్యాలయంలో చెక్ రూపంగా అందజేశారు. అడిగిన వెంటనే ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యేకి ఆలయ కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన

జగదాంబ: గురువారం స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. స్నేహసంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యుడు సూర్యతేజ పరీక్షలు చేశారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలని, వ్యాయమం చేయాలని రోగులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సదస్సు రేపు

డాబాగార్డెన్స్: శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖలో భారతీయతలో–అమృతకాలం అనే అంశంపై ఈ నెల 10, 11 తేదీల్లో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్టు ప్రోగ్రామ్ కన్వీనర్ ఎస్.రాధాకుమారి తెలిపారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్ డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా జరగనున్న సదస్సుకు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, ఆచార్యులు పాల్గొని జ్యోతిష్యం, ఆరాధ్య వ్యవస్థ, ఆలయ వ్యవస్థ, రక్షణ వ్యవస్థ, శిక్షణ వ్యవస్థ, ఆధ్యాత్మికత–భారతీయత, ఆర్థ వ్యవస్థ ఇలా అనేక అంశాలపై ప్రసంగిస్తారన్నారు. విశాఖలో తొలిసారిగా మానవాళి మనుగడకై వివిధ అంశాలపై నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సదస్సుకు నగర వాసులు విచ్చేయాలని కోరారు.

పిస్తోల్ కేసులో చురుగ్గా విచారణ

సీతమ్మధార : మహారాష్ట్ర నుంచి పిస్తోల్‌ను ఒడిశాకు తరలిస్తున్న శ్రీధర్ హరికిషన్ పతాంగిని పోర్టు టౌన్ పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించారు. అలాగే పిస్తోల్ ఇచ్చి పంపించిన మహారాష్ట్రలోని జలానా జిల్లాకు చెందిన దత్తపవర్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరినీ ఒకే చోట ఉంచి గురువారం విచారణ చేపట్టారు. అసలు పిస్తోల్ ఎవరు ఇచ్చారు..?, ఎక్కడి నుంచి వచ్చింది..? అన్న కోణంలో ఆరా తీశారు. అయితే ఈ ఇద్దరూ చెప్పిన మాటలకు పొంతన లేకపోవడంతో దత్త పవర్‌ని ప్రత్యేకంగా విచారించారు. సందీప్ అనే వ్యక్తి నుంచి కోనుగోలు చేసినట్లు దత్త పవర్ పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. ఈ కేసులో రోజుకో కొత్త పేరు వెలుగులోకి రావడం పోలీసులకు తలనొప్పిగా మారింది. గతంలో ఆత్మ రక్షణ కోసమని చెప్పి... ప్రస్తుతం సందీప్ నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పడంతో ఆ వ్యక్తిపై పోలీసులు దృష్టి సారించారు. అసలు పిస్తోళ్లు ఎవరు సరఫరా చేస్తున్నారు అన్న కోణంలో ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ


సహస్ర తులసి పూజలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న ఈవో శిరీష తదితరులు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి ఆలయ అభివృద్ధి పనులకు ఆలయ ఈవో కె. శిరీష గురువారం భూమిపూజ చేశారు. అన్నదానం స్వీకరించేందుకు విచ్చేసే భక్తులు వేచి ఉండేందుకు రూ.24 లక్షలు కెనరా బ్యాంక్ ఆర్థిక సౌజన్యంతో దేవదాయ శాఖ అనుమతితో భక్తులు వేచి ఉండే హాలు కోసం ఈ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవోతో పాటు కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ పి.రవికుమార్, ఏజీఎం ఎస్. మధుసూదనరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు మళ్ల ధనలత, మీసాల అశోక్‌కుమార్, ఎస్. సతీష్, ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్. సురేష్, కార్యనిర్వాహక ఇంజినీర్ సీహెచ్‌వీ రమణ, ఏఈవో వెంపలి రాంబాబు, సహాయ ఇంజినీరు కె. సూర్యనారాయణమూర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే..

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేషకుమార్ చొరవతోనే తన కుమారుడి మృతదేహం తమకు అప్పగించారని ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన అయాజ్ అహ్మద్ తండ్రి అబ్దుల్ అజీజ్ సాక్షికి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. గాజువాక దేవాడ అజీమాబాద్‌కు చెందిన అయాజ్ అహ్మద్ (19) నగరంలోని ఆరిలోవ స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పొందుతున్నాడు. ఈ నెల 5తో కోర్సు ముగియనుండగా గత నెల 21 రాత్రి 8 గంటలకు తండ్రి ఆయాజ్‌కు ఫోన్ చేసి కాసేపు మాట్లాడారు. ఆ మరుసటి రోజు 22 ఉదయం 10 గంటలకు సెంటర్ నుంచి ఫ్యాకల్టీ తండ్రికి ఫోన్ చేసి ఆయాజ్ క్లాస్‌లో లేడని చెప్పారు. దీంతో తండ్రి ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. మరుసటి రోజు కూడా సమాచారం లేకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిందిగా సెంటర్ ఫ్యాకల్టీకి చెప్పారు. ఇదిలా ఉండగా 22న గుర్తు తెలియని మృతదేహం గోకుల్‌పార్క్ బీచ్ సమీపానికి కొట్టుకొచ్చింది. 26 వరకు ఆ మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. ఎవరూ రాకపోవడంతో ఆ రోజు ఉదయం పోస్టుమార్టం నిర్వహించి కాన్వెంట్ జంక్షన్ స్మశానవాటికలో ఖననం చేశారు. అదే రోజు సాయంత్రం అయాజ్ అహ్మద్ తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. ఆ మృతదేహం తన కొడుకుదేనని, చివరి చూపుతో పాటు తమ సాంప్రదాయం ప్రకారం ఖననం చేసుకోవడానికి మృతదేహాన్ని ఇవ్వాలని పోలీసులను వేడుకున్నారు. నేరుగా బాడీని తాము ఇవ్వలేమని, వీఆర్వో నుంచి లెటర్ తెచ్చుకోవాలని చెబితే, వీఆర్వో చుట్టూ తిరిగారు. వీఆర్వో తాను లెటర్ ఇవ్వలేనని, ఆర్డీవో నుంచి తెచ్చుకోవాలని సూచించారు. ఆర్డీవో కూడా తాను ఇవ్వలేనని చేతులెత్తేయడంతో అయాజ్ అహ్మద్ తండ్రి 27వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ద్వారా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో పాటు కలెక్టర్‌కు ఫోన్ చేసి చెప్పడంతో కింది స్థాయి అధికారులు వెంటనే స్పందించి తన కుమారుని మృతదేహాన్ని తమకు అప్పగించారని చెప్పారు. సహకరించిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు, 27వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డికి అయాజ్ అహ్మద్ తండ్రి కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా సభ్యత్వాల నమోదు


సభ్యత్వ నమోదు పత్రాలు చూపిస్తున్న విద్యార్థులు


చేతిరాతపై మెలకువలు నేర్పుతున్న సంజీవ్‌కుమార్

అల్లిపురం: గ్రంథాలయంలో సభ్యత్వాల నమోదుకు విద్యార్థులు పోటీ పడ్డారు. నెల రోజులుగా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి విశేష ఆదరణ లభించింది. శిక్షణ శిబిరంలో విద్యార్థులు పుస్తక పఠనం, చిత్రలేఖనం, క్రాఫ్ట్స్ తయారీలో శిక్షణ పొందారు. అదే విధంగా మహనీయుల చరిత్రలు తెలుసుకున్నారు. దీంతో వారు గ్రంథాలయాల విశిష్టతను తెలుసుకున్నారు. గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలన్న సంకల్పంతో వారంతా గురువారం సభ్యత రుసుము చెల్లించి సభ్యత్వం పొందారు. దీని వలన కావాల్సిన పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదువుకునే అవకాశం ఉంటుందని వారు తెలిపారు.

విద్యార్థులకు దాండియాలో శిక్షణ..

వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు దాండియాలో శిక్షణ అందించారు. గ్రంథాలయాధికారి పీవీ నూకరాజు ఉత్సాహపూరిత వాతావరణంలో పిల్లలకు దాండియా నృత్యం నేర్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజేంద్రవర్మ, గిరి, అరుణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చేతిరాతకు పదును పెడదాం

డాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం 'చేతి రాతకు పదును పెడదాం' కార్యక్రమం నిర్వహించారు. సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డి. సంజీవ్‌కుమార్ పాల్గొని చిన్నారులకు చేతి రాతపై మెలకువలు నేర్పారు. దస్తూరి బాగుంటే పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయాధికారి రాజేంద్రవర్మ, అరుణ, గిరి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం


సత్కార గ్రహీతలతో కార్పొరేటర్ మహ్మద్ సాధిక్

జగదాంబ : గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. అవార్డులు పొందిన వలంటీర్లకు జగనన్న ఇచ్చిన సేవామిత్ర బ్యాడ్జి అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాల ఏర్పాటు చూసి పక్క రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయంటే జగనన్న పాలన ఏమిటో అర్థం అవుతుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలతో సేవాభావంతో మెలిగి ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికుడికి విముక్తి

అల్లిపురం: నగర పోలీస్ కమిషనర్, లేబర్ కమిషనర్ సంయుక్త ఆధ్వర్యంలో బాలకార్మికులను గుర్తించేందుకు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీంట్లో భాగంగా ఆనందపురంలో దాడులు నిర్వహించి ఒక బాలుడిని రక్షించి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇప్పటి వరకు 17 మంది బాలబాలికలను రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీపీ తెలిపారు.